# ఏరు దాటాక...




**నిజాయితీ నిప్పు కణికయితే, నిప్పుకణిక ఆడదయితే. ఆ ఆడదాని పేరు మాళవిక. తన ఉత్తరీయంలో ఆ నిప్పు కణికను మూటకట్టజూచాడు ప్రభు! ఉత్తరీయం జెండాగా ఎగిరితేనే నిప్పు ఒక వెలుగు వెలిగింది!**

"కాలేజీ రోడ్! కాలేజీ రోడ్!" అరిచాడు కండక్టర్.

చటుక్కున బస్ దిగాను.

మెయిన్ రోడ్డు దిగి దాదాపు రెండు ఫర్లాంగులు నడిస్తే కాలేజీ. మధ్యలో ఇళ్ళేమీ లేవు. పాంట్ జేబులో చేతులుంచుకుని నడుస్తున్నాను. ఏదో ఉత్సాహం... కొంచెం బెరుకు. ఎందుకంటే ఓ ఉద్యోగిగా నా జీవితం ఈ రోజు నుంచే మొదలవుతుంది.

కాలేజీ దగ్గరవుతూంటే కంగా రింకా ఎక్కువైంది. అయితే నా భావా లన్నింటినీ వెనక్కి నెట్టేస్తూ గొప్ప ఆకర్షణీయమైన దృశ్యం కనబడింది నాకు. కాలేజీ కాంపౌండ్ గోడ మీద ఎక్కడ చూసినా. అదేదో డిజైన్‌లా "మాళవిక + ప్రభు = ?" అన్న అక్షరాలే!

గేటు దాటి లోపలికి అడుగు పెడుతూనే ఆ మాళవికకి ఓ ఆకారం ఇచ్చేశాను. చాలా చెత్త ఊహలు. ఆమె గురించి ఆలోచిస్తూనే ప్రిన్స్‌పాల్ గార్ని కలుసుకున్నాను. ఆయన స్వయంగా ఫస్ట్ బి.ఎస్సీ. క్లాస్‌కి తీసుకెళ్ళి స్టూడెంట్స్‌కి పరిచయం చేసి, నాకు "బెస్టాఫ్ లక్" చెప్పి వెళ్ళిపోయాడు.

నిన్న మొన్నటి వరకూ ఓ విద్యార్థిగా గడిపిన నేను ఈ రోజు ఉపాధ్యాయుడిని. చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది.

నా తన్మయత్వాన్ని చెదర గొడుతూ వెనక బెంచీల్లోంచి పిల్లి కూతలు! నక్క ఊళలు. నాకు కోపం రాలేదు. నవ్వొచ్చింది.

"ఎవరు బాబూ అంత చక్కగా కూసేదీ? చాలా సహజంగా ఉంది సుమా! నిజంగా నక్కలూ, పిల్లులూ మన క్లాస్‌లో ఉన్నట్లే ఉంది. ఇంత చక్కటి అనుభూతి నిస్తున్న ఆ మిమిక్రీ ఆర్టిస్ట్‌ని అభినందించాలను కుంటున్నాను. లేచి నిలబడతారా?"

ఒక్క క్షణం గాఢమైన నిశ్శబ్దం. తర్వాత గొల్లున నవ్వులు. నేనూ నవ్వేశాను, పరిచయాలు ఏవో కబుర్లు దాదాపు ఆ రోజంతా అలాగే గడిచి పోయింది.

లాస్ట్ అవర్ సెకండ్ బి.ఎస్సీ. చాలా మంచి క్లాసనిపించింది. అంత నిశ్శబ్దంగా ఉన్నారు. ఒక్కొక్కళ్ళూ లేచి నిలబడి తమ పేర్లు చెప్తున్నారు. నేను మామూలుగా వింటున్నాను.

ఆఖర్న... ఆ అమ్మాయి... లేచి నిలబడింది. "నా పేరు మాళవిక."

నేను ఉలిక్కిపడి ఆమె వైపు సూటిగా చూశాను. ఆమె అతి సామాన్యంగా ఉంది. విశాలమైన కళ్ళు తప్ప ఆమెలో కొట్టొచ్చినట్లు కనపడే ఆకర్షణ లేవీ లేవు. గోడల మీద కెక్కడం వల్ల ఆమంటే నాలో ఏదో తేలిక భావం. 'నువ్వా తల్లీ...'? అనుకున్నాను.

రోజులు గడిచిపోతున్నాయి. ఈ కొత్త జీవితా నికి అలవాటు పడుతున్నాను.

ఆ రోజు నను కాబరే షో నుంచి చాలా జాలీగా వస్తున్నాను. రాత్రి దాదాపు పదకొండున్నర చలిగాలి వీస్తోంది.

రోడ్డు పక్కనే ఉన్న చెట్టు కింద ఓ ఆడది నిలబడి ఉంది. నన్ను చూడగానే చప్పున వెలుతుర్లో కొచ్చింది. పమిటెని జారవిడుస్తూ 'దగ్గరే.... రాకూడదూ?'' అంది. ఆమె పెదాలు నవ్వుతున్నా కళ్ళు నిర్లిప్తంగా ఉన్నాయి.

నేను పడి వడిగా ఆమెని దాటుకుంటూ నడిచాను. ఆ శిథిల భవనంలో బావుకునేదేవీ ఉండదు. కాబరే ఆమ్మాయిలైతే.... గజ్జెల గుర్రాల్లా నున్నగా నిగ నిగలాడుతున్నారు. ఆ అమ్మాయిల్ని తల్చుకుంటూ నడుస్తున్న నేను ''నమస్తే... మేష్టారూ!'' అన్న పిలుపుతో తలెత్తి చూశాను.

ఎదురుగా మాళవిక. పక్కనే ప్రభాకర్. ప్రభాకర్ కోటు మాళవిక కప్పుకుని ఉంది. ఆమె కళ్ళల్లో ఏవో దివ్య లోకాల్ని సందర్శించి వచ్చిన నిషా.

ఎందుకో తెలియదు... నా మనసు భగ్గుమంది. పళ్ళు కొరుక్కుంటూ నిశ్శబ్దంగా నిలబడ్డాను. చెట్టు క్రింద ఆడదానిలా ఈ మాళవిక, పక్కనే ప్రభాకర్. అర్థరాత్రి పూట గోడ మీద రాసిన ఆ తలమాసిన వాడెవడికో? అన్న ప్రశ్నార్థకం ఎందుకొచ్చిందో! ఇజీక్వల్టూ, ఫ్రీ సెక్స్! కసిగా పళ్ళు కొరుక్కుంటూంటే.... ''వస్తాం మేష్టారూ'' అంది మాళవిక మళ్ళీ.

ఇద్దరూ కదిలి వెళ్ళిపోతుంటే నా కడుపులో మంట. ఓ వికృతమైన ఆలోచన కూడా వచ్చింది. ''ఎలాగూ రోడ్డు మీద పడింది కదా ఈ రాత్రికి నా రూమ్‌కి రమ్మంటే ఏమనేదో!''


గలా గలా మాట్లాడుకుంటూ వెళ్ళిపోతున్నారిద్దరూ. నేనిన్ని రోజులూ చూడలేదు - మాళవికది బాగా పెద్ద జడ. ఆ జడ ఆమె పిరుదుల మీద అందంగా కదుల్తోంది.

ఆ రాత్రంతా ప్రభాకర్ చేతి వేళ్ళు, మాళవిక నా మనసులో కదిలి... నాలో అసహనం... ఈర్ష్య!

తెల్లారిన తర్వాత క్లాసులో మామూలుగా మాళవిక. నా కామె వైపు చూడాలంటేనే చిరాకనిపించింది. 'నా క్కూడా అవకాశమిస్తే బాధ ఉండకపోనే'మో' అనుకున్నాను.

ఆ సాయంత్రం ఏదో మీటింగ్ అయిపోయిన తర్వాత వస్తూ ఉంటే లేత చీకట్ల మధ్య.... పారిజాతం చెట్టు కింద మాళవిక.... సురేంద్రతో మాట్లాడుతూ. ఆమె నవ్వు జలతరంగిణిలా.

''డర్టీ బిచ్!'' అనుకున్నాను. వాళ్లని దాటిపోతూంటే మాళవిక విష్ చేసింది. సాంస్కృతిక వ్యవహారాల్లో ముఖ్య భూమిక తీసుకుంటున్నట్లుంది. ''తర్వాత ఆలోచిద్దాంలే సురేంద్రా!'' అని అతనికి చెప్పి, నాతో పాటు నడవడం మొదలెట్టింది.



"ఈ సురేంద్ర సాంస్కృతిక కార్యదర్శి కదా. ఇతనో పెద్ద తలనొప్పి నాకు, ముందుగా ఆ పిరికితనం నన్ను ప్రేమించాడంట. అయితే నేను ప్రభాకర్‌కి హాండిస్తున్నానని గోడల మీద పడి ఏడుస్తున్నాడు. నే నివన్నీ పట్టించుకోను మేష్టారు! జాలి పడతాను."

ఆమె అంత ఫ్రీగా దగ్గర తనంతో మాట్లాడ్డం నాకేదోలా అన్పిస్తున్నా కాస్త సంతోషాన్నిస్తూంది. బహుశా ఆ సంతోషం నాలో అవకాశవాదిదేమో! దగ్గరవడానికి మాటలే కదా దగ్గర దారి!

"రాత్రి బాగా ఆలస్యం అయినట్లుంది.... హాస్టల్ వార్డెన్ కంటబడకుండా ఎలా మానేజ్ చేశావు?"

"ఇది రెండోసారి మేష్టార్స్ నే నిలా గోడ దూకి బయట కెళ్ళడం. ఏం చెయ్యడం? అది నా బలహీనత. గద్దర్ పాటలంటే పడి చచ్చిపోతాను. రైతు కూలీల మహాసభకి గద్దర్ వస్తున్నాడని తెలిసిన దగ్గ ర్నించి ఒకటే ఆరాటం. ఏమిటో మనిషికో పిచ్చి! కొందరికి ఎం.ఎస్. సుబ్బలక్ష్మి, కొందరికి మైకేల్ జాక్సన్, నాకు... చుట్టూ ఉన్న జనం ఆర్తనాదాల్నించి బయటపడే సంగీతం".

నేను నిలబడి పోయాను షాక్‌తో.

చుక్క లప్పుడప్పుడే మొలుస్తున్నాయి. వాటితో తళుకులు కుట్టిన నల్లటి ఆకాశం షామియానా కింద..... చల్లటి గాలి తెరల మధ్య.... నా గుండెల్లో పుట్టిన కార్చిచ్చు మెదడు వరకు పాకి ప్రతి ఆలోచననీ దహించేస్తోంది... బాధ... బాధ! ఎందుకో తెలియదు. నా బుగ్గల మీద కన్నీళ్ళు... నిన్న రాత్రి ఈ అమ్మాయిని పరమ ఘోరంగా పోస్టుమార్టమ్ చేశాను నా మనసులో. కాని ఈమె... ఈమె.....

నాలో నేను పిచ్చిగా మథన పడుతూండగానే మాళవిక వెళ్ళిపోయింది. నేను నడవడం మొదలెట్టాను... ఎంతకీ కళ్ళల్లో తడి ఆరడం లేదు.

* * *

నేను క్లాసులో పాఠం చెప్తూండగా వచ్చాడు ప్యూన్ మాళవిక గురించి.

మాళవిక మొహం అదోలా అయిపోయింది. అయినా వెళ్ళింది.

నేను క్లాస్ అయిన తర్వాత స్టాఫ్ రూమ్ వైపు వెళ్తూంటే మాళవిక ఎవరితోనో మాట్లాడుతూ కనపడింది. ఆయ నెక్కడో చూసిన జ్ఞాపకం. కాసేపటికి జ్ఞాపకం వచ్చింది. నా రూమ్ కెదురుగా ఉన్న ఇంటి గోడ మీద అతికించి పోస్టర్, వినయంగా చేతులు జోడించి ఓట్లు అడుక్కుంటున్న రాజకీయ నాయకుడు. బంగార్రాజు. అతనే తర్వాత ఎమ్.ఎల్.ఏగా గెలిచాడు కూడా. మాళవికకి ఏమవుతాడు? గోడ మీద బంగార్రాజులా... ఆ అమ్మాయిని బ్రతిమాలుతున్న ట్లున్నాడాయన

తర్వాత రోజు ఒంటరిగా మాళవిక కనపడినప్పుడు అడిగాను.

నా ప్రశ్నకి పెద్దగా నవ్విందామె. "ఆ గోల్డెన్ కింగ్ మా నాన్న".

ఇదో షాక్‌నాకు! బంగార్రాజు నిజంగా పేరుకి తగ్గవాడే. ఆగర్భ శ్రీమంతుడు. అతగాడి కూతురు హాస్టల్‌లో ఉండాల్సిన అవసరం ఏముంది? పైగా ఆయన ఊరు టౌన్ పక్కనే.

"అయితే వెండి చెంచా నోట్లో వేసుకుని పుట్టావన్న మాట."

"ఆరుగురు సంతనంలో నేను చివరిదాన్ని. మా ఇంట్లో జనాభాకీ, నాకూ బొత్తిగా పడదు. మా అమ్మ చెంబులూ, తప్పేళాలు, మంగళ సూత్రాలూ కుదువ బెట్టుకుని ఎక్కువ వడ్డీకి డబ్బులు తిప్పుతూ ఉంటుంది. మా అక్కలకి ఖరీదైన మొగుళ్ళున్నారు. వాళ్ల సేవల్లో మునిగి తేలుతూ ఉంటారు. మా అన్నయ్యలు మా నాన్న అడుగు జాడల్లో నడుస్తూ, మనుష్యుల బలహీనతల్ని వాళ్ళ కనుకూలంగా మార్చుకుంటూ, అదో బురదగుంట! అక్కడ ఒకటే నియమం. ఆడది వంటింటి కుందేలైతే మగాడు మహారాజు. పరాయి ఆడదాన్ని పడగ్గదిలోకి తెచ్చుకున్నా చెల్లుతుంది. చెరచడం, చట్టానికి దొరక్కుండా తప్పించుకోవడం మా అన్నలకి వెన్నతో పెట్టిన విద్య. మా ఇంట్లో అందరూ నన్ను చెడబుట్టా నంటారు." ఆగింది మాళవిక.

"మనిషిని పిండి ఆ రక్తధారల్లో స్నానం చెయ్యాలంటారు వాళ్ళు. ఇంకొకరి శ్రమ ఇనప్పెట్టెల్లో నోట్ల కట్ట లవ్వాలంటారు. నాకెందుకో చిన్నప్పట్నించీ వాళ్ళ మీద తిరగపడడం అలవాటైపోయింది. పది రూపాయలు కూతురి మందుల కోసం దొంగ తనం చేసిన మా పాలేరుని చెట్టుకి కట్టి కొరడాలతో కొట్టినప్పుడు పరిగెత్తు కెళ్ళి అడ్డం నిలబడ్డాన్నేను. హింస పట్ల ఏర్పడ్డ భయం... క్రమంగా నన్ను వాళ్ళకి దూరం చేసింది. మేష్టారూ! మా నాన్నంటే నాకు ఎలర్జీ. ఆయన ఆగడాల వల్ల చాలా మంది ఆడాళ్ళు అన్యాయమైపోయారు. ముఖ్యంగా గంగ... నా ఫ్రెండ్, నేను ఇంట్లోంచి వచ్చేసి హాస్టల్లో చేరాను. అప్పుడప్పుడు నన్ను చూడటానికి వస్తూ ఉంటాడు. డబ్బు కావాల్సినంత పసూలు చేస్తాను. ఇప్పుడేదో పెళ్ళి సంబంధం తీసుకొచ్చాడు. తరగని ఆస్తి. ఆ కుర్రాడు అమెరికాలో డాక్టరు. నన్ను అమెరికా పంపేస్తే పీడ విరగడ అవుతుం దనుకుంటున్నాడు".

మాళవికని వింతగా చూస్తూ నిలబడ్డాను! "ఎందుకీ అమ్మాయి అన్నింటికీ అతీతంగా ఉండటం? ఆస్తి... బంగారం, ఖరీదైన భర్త, అమెరికా జీవితం. ఇవన్నీ ఇవ్వలేని 'కిక్' ఈ పోరాటాల్లో ఈమెకి దొరుకుతుందా? ఆదర్శాలు కూడు పెట్టవన్న విషయం ఈమె ఆలస్యంగా తెలుసుకుంటుంది... అప్పుడు ఎలా ఫీలవుతుంది మాళవిక? వాళ్ళమ్మలా... అక్కల్లా..."

"ఏమిటి మేష్టారూ ఆలోచన?"

"రాజీ పడిపోవడంలో చాలా హాయి ఉంటుంది..."

మాళవిక చిత్రంగా కళ్ళార్పింది. చిన్న చిరునవ్వుతో అంది. "రాజీ అనేది నా నిఘంటువులో లేదు".

హుందాగా నడిచి వెళ్ళిపోతున్న ఆమెను కన్నార్ప కుండా చూస్తూ నిలబడ్డాను. ఈ మొండి పిల్ల జీవితం ఏమవుతుంది చివరికి? నిట్టూర్చి కదిలిపోయాను.

* * *


సంవత్సరాంతం పరీక్షలై పోయాయి. సెలవులకు ఊరెళ్ళి వచ్చాను. వచ్చిన రోజు సాయంత్రం ప్రభాకర్ వచ్చాడు నా దగ్గరికి.

"ఏమిటోయ్ విశేషాలు?" అన్నాన్నేను సామాను సర్దుకుంటూ.

ప్రభాకరం తటపటాయిస్తున్నట్లు నిలబడ్డాడు. "మా అందరికీ అంటే... మా స్టూడెంట్స్‌కి మిమ్మల్ని చూస్తే ఆత్మీయులనిపిస్తారు. బహుశా మీరు కొత్తగా ఎప్పాయింట్ అవడం వల్ల కావచ్చు.

"అవునూ... కుర్ర లెక్చరర్ అనడానికి అంత ఇబ్బందెందుకు?"

నవ్వాడు ప్రభాకర్. "మాళవిక వ్యక్తిత్వం



ఈపాటికి మీకర్థమయ్యే ఉంటుంది. అసలు మాళవిక నా ప్రపోజల్ని ఒప్పుకుంటుందనుకోలేను. కాని ఒప్పుకుంది. అయితే చాలా హామీలు తీసుకుంది మేష్టారూ! నేనానందంగా అంగీకరించాను. బహుశా భర్తగా కంటే కూడా స్నేహితుడుగానే ఎక్కువ నేను బ్రతకాల్సి రావొచ్చు. సూర్యుడి ముందు దివిటీ వెలుగు కనబడదు. కాని మాళవిక నాకు కావాలి! తనీ పెళ్ళికి ఒప్పుకోవడానికి నగం కారణం వాళ్ళ నాన్న తెచ్చిన సంబంధం. ఏదో ఒక రోజు తన కాళ్ళూ చేతులూ కట్టేసి ఆ పెళ్ళి చేసేస్తారన్న భయం!''

"నిర్ణయాలన్నీ తీసుకున్న తర్వాత నేనేం చెప్పగలను?''

"మీ ఆసరా కావాలి మేష్టారూ! పెళ్ళి రిజిస్ట్రార్ ఆఫీసులో... మీరూ ఒక సాక్షిగా నిలబడాలి''

నేను ఒప్పుకున్న తర్వాత ప్రభాకర్ వెళ్ళిపోయాడు.

నాకేదో బాధగా ఉంది. నా వస్తువు నేదో ప్రభాకర్ పట్టుకుపోతున్నాడన్న బాధ. మాళవి కంటే ఇష్టం ఉంది కాని భరించగలనా? ప్రభూలా నేను గంగిరెద్దులా తలూపలేను. నా వరకు నాకు భార్యంటే సంసారాన్ని చక్కదిద్దుకుంటే చాలు.

** ** **

పెళ్లంటే ఆడ పిల్లలో ఆటోమాటిక్‌గా సిగ్గు వచ్చేసుందన్న నా అభిప్రాయాన్ని తోసిపారేస్తూ చాలా మామూలుగా ఉంది మాళవిక. కాకపోతే పట్టు చీర కట్టుకుంది. అంతే. అదే నవ్వు... మాట!

పెళ్లయిపోయింది. బయటి కొచ్చిన తర్వాత నాతో అన్నది మాళవిక. "ప్రభూకన్నీ వెధవ సెంటిమెంట్స్! లేకపోతే ఏమిటి? తన గోల్డ్ మెడల్ అమ్ముకుని ఈ ఉంగరం కొని నావేలికి తగిలించాడు. అంత కంటే ఆ గోల్డ్‌మెడల్ నా చేతిలో పెడితే సంతోషించేదాన్ని.''

ప్రభు మొహంలో గాయపడిన హృదయం ఆనవాళ్ళు.

"నువ్వు కాస్త మాట్లాడ్డం తగ్గించెయ్ మాళవికా!'' అన్నా న్నేను.

"ఏం ప్రభూ? నీ మాటా అదేనా?'' కొత్త పెళ్ళికూతురు ఎంత లవ్ మారేజ్ అయినా... ఏం పిల్ల మాళవిక?

ప్రభాకర్ మాట్లాడలేదు. సున్నితంగా ఆమె చెయ్యి నొక్కి పట్టుకున్నాడు.

** ** **

రోజులు చక చకా గడిచిపోతున్నాయి. ఎందరో విద్యార్థులు... మాళవిక లాంటి వ్యక్తి ఎవరూ తారస పడలేను. మాళవిక, ప్రభాకర్ డిగ్రీలు పూర్తి చేసుకుని చిన్న ఉద్యోగాలు సంపాయించుకున్నారు. అప్పుడప్పుడూ నా దగ్గరికి వస్తూ ఉంటారు.

ఆ రాత్రి భోజనం చేసి సిగరెట్ కాలుస్తూ వీధిలో నిలబడ్డాను, దూరంగా మాళవిక, ప్రభాకర్. సిగరెట్ కాల్చడం తొందరగా పూర్తి చేసుకుని వాళ్ల వైపు చూస్తూ నిలబడ్డాను.

"నమస్తే మేష్టారూ!'' ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"లోపలకి రండి'' అన్నాను.

"పర్వాలేదు లెండి. ఏది చెయ్యాలనుకున్నా ముందు మీ చెవిన వెయ్యడం నా అలవాటు. అందుకే...'' ఆగాడు ప్రభాకర్.

"రాజకీయాల్లోకి దిగి ప్రజా సేవ చెయ్యాలనుకుంటున్నాడు మానవుడు. అదీ మా నాన్నకి పోటీగా''.

నేను చటుక్కున ప్రభాకర్ వైపు చూశాను. అతని మొహం శాంతంగా ఉంది. కళ్ళల్లో నవ్వు. అతని అసలు స్వరూపానికి విరుద్ధంగా 'మేకప్' వేసినట్లు నాకు మొదటి సారిగా అన్పించింది. 'ప్రభాకర్ అసాధ్యుడు' అని కూడా అనుకున్నాను. ఏనుగు చచ్చినా బ్రతికినా వెయ్యి రూపాయలే అన్నట్లు బంగార్రాజు కూతురుగా మాళవిక పాత్ర తక్కువదేమీ కాదు.

"నీకంటే మాళవిక నిలబడితే బావుంటుందోయ్....''

ఈసారి ప్రభాకర్ పెదవులు నవ్వుతున్నా కళ్ళల్లో పదునైన బాకులు. "ఆ ఊహ రాలేదు మేష్టారూ... ఇద్దరం ఒకటే కదా, ఎవరైతే ఏం.... అనుకున్నాను''


ప్రభాకర్ మాటలకు సహజంగానే మాళవిక ఏమీ మాట్లాడలేదు. కాసేపుండి ఇద్దరూ వెళ్ళిపోయారు.


మెల్ల మెల్లగా ఊర్లో ఎన్నికల సందడి రాజుకుంది. అన్నింటినీ మించిన సంచలనం మామా అల్లుళ్ళ పోటీ. చాలా మంది కుర్రకారు ఈ పోటీని సినిమా రంగుటద్దాల్లోంచి చూస్తూ క్రేజ్ పెంచుకున్నారు. మాళవిక చురుగ్గా పాల్గొంది. ఆమెది మంచి వాగ్ధాటి. అయితే ఆమెలో కల్లాకపటం లేదు. గుండెల్లోంచి వచ్చిన మాటలని. గంటలు గంటలు జనాన్ని కదలనివ్వకుండా ఏక ధాటిగా మాట్లాడేది. క్రమంగా ఆ అమ్మాయి మీటింగ్ అంటే జనం ఎక్కువ సంఖ్యలో హాజరవడం మొదలు పెట్టారు. ప్రభాకర్ కేవలం ఉత్సవ విగ్రహం. అయితేనేం తండ్రీ కూతుళ్ల మధ్య యుద్ధం! మాళవిక వాగ్ధాటి, జనంలో ఆమె పట్ల కలిగిన సానుభూతి అన్నీ కల్సి ప్రభాకర్‌కి పట్టం కట్టాయి.

### క్షీరదాలు - గర్భావధి

లైంగిక ప్రత్యుత్పత్తిలో స్త్రీ, పురుష సంయోగ బీజాల కలయిక వల్ల ఫలదీకరణం జరుగుతుంది. క్షీరదాల్లో ఫలదీకరణం జరిగినది మొదలు పిల్లలను ప్రసవించే వరకు జరిగే కాలాన్ని 'గర్భావధి' అంటారు. గర్భావధి కాలం సాధారణంగా జంతువు పరిమాణాన్ని బట్టి మారుతుంది. కొన్ని సామాన్య క్షీరదాల్లో గర్భావధి [రోజులలో] ఇలా ఉంది. చుంచెలుక - 21, పెంపుడు కుందేలు 30-34, ఇండ్లలో తిరిగే పిల్లి, పెంపుడు కుక్క - 68, గినీ పంది - 68, హంస - 114, గొర్రెలు, మేకలు - 149, కంచర లేడి 203-208, పెద్ద ముంగిస 259-275, ఆవు 270-280, గుర్రం 330-380. ఏనుగు దాదాపు 20 నెలలు.

సమ్మెట గోవర్ధన్



చూస్తూండగానె ప్రభాకర్ చాప కింద నీరులా రాజకీయాల్లోకి చొచ్చుకుపోతున్నాడు. అదృష్టం కొద్దీ సహాయ మంత్రిగా పదవి కూడా లభించింది. దాంతో వాళ్ళిద్దరూ మకాం హైదరాబాద్‌కు మార్చేశారు.

ఆర్నెల్ల తర్వాత మాళవిక దగ్గర్నించి నాకో ఉత్తరం వచ్చింది.

"పూజనీయులైన మేష్టారుగారికి,

"నమస్కారాలు. మేం చాలా ఎదిగి పోయాం. మేష్టారూ! కార్లు, బంగళాలు, పొలాలు, బంగారాలు... మెల్ల మెల్లగా వచ్చేస్తున్నాయి. ఇవన్నీ నేను కోరుకున్నానా మేష్టారూ? "మనకివేమీ వద్దు ప్రభూ... అవినీతి జోలికెళ్ళొద్దు. నాకేం చెప్పావు నువ్వు? అధికారం ఉంటే బీదా బిక్కికి సాయం చెయ్యొచ్చు నన్నావు... ఏదా మాట?"

"ప్రభాకర్ వికృతంగా మారిపోతున్నాడు. నేనేం చెయ్యాలనుకున్నాను? నేను కన్న కలలేమిటి? మేష్టారూ! మొన్నటికి మొన్న నేను మురికివాడలకు వెళ్ళానని ఇష్టమొచ్చినట్లు మాట్లాడాడు. ఎలక్షన్ల ముందు అలాంటి చోట్లని ఆలయాల్లా భావించినట్లు ప్రవర్తించి.....! మేష్టారూ ప్రభు తేనె పూసిన కత్తి. మీరా రోజు అన్నట్లు నేను పోటీ చేసినా బావుండేది. ప్రభూ దగ్గర కాలి కింద చెప్పులా ఉండలేకపోతున్నాను మేష్టారూ! అతని వంచనని భరించలేక పోతున్నాను. ఏదో ఒకటి చెయ్యాలి. చేస్తాను!

"మాళవిక."

ఆ ఉత్తరం వచ్చిన సంవత్సరానికి ప్రభాకర్ మా ఊళ్ళో ఏదో ప్రారంభోత్సవానికి వస్తే నేనూ వెళ్ళాను. అతి కష్టం మీద అతని దర్శనం దొరికింది. మనిషి బాగా మారాడు అనడం కంటే అసలు రూపం చూపిస్తున్నాడా అన్పించింది.

"కూర్చోండి మేష్టారూ... చూస్తున్నారుగా! మిమ్మల్ని కలుసుకోవాలంటే ఊపిరిసలపని పని." అన్నాడు. కూల్‌డ్రింక్ తెప్పించాడు.

"మాళవిక ఎలా ఉంది?" నా ప్రశ్నకి అతను భావాలన్నీ మార్చేసుకుని, బాధగా మొహం పెట్టి, "మాళవిక మహా మొండిది మేష్టారూ! అసలు నేనేం చేసినా తనకి నచ్చదు... తన సంగతి మీకు బాగా తెలియదు మేష్టారూ... చాలా గర్వం... తనవల్లే నేనేదో గెలిచినట్లు. ఫ్యాక్టరీ పెట్టుకోవడానికి లైసెన్స్ ఇస్తే... అది గుడిసెల వాళ్లకి పెద్ద ప్రమాదం అంటుంది. ఈ మధ్య కాస్త గొడవైంది. నేనెంత బ్రతిమలాడినా వినకుండా ఇంట్లోంచి వెళ్ళిపోయింది." అతను చెప్పడం పూర్తి చేసి మౌనంగా ఉండిపోయాడు. ఏదో పెద్ద బాధపడుతున్నట్లు.

అంతలో సురేంద్ర ఏవో కాగితాలతో లోపలికి వచ్చాడు. "కూర్చోవోయ్" అన్నాడు ప్రభాకర్.

నాకు కళ్ళు తిరిగి నట్లయింది. ఒకప్పుడు సురేంద్ర ఇతనికి పెద్ద శత్రువు. ముఖ్యంగా గోడలు ఖరాబు చేసింది ఇతగాడే.అంతేగాదు, ఎన్నికల ప్రచారంలో ఓ మీటింగ్‌లో మాళవికని నానా రభసా చేసి గందరగోళం సృష్టించాడు. కారు కూతలు కూశాడు. అలాంటి వెధవని అసలు లోపలికి రానిస్తుందెందుకు? తెలుస్తూనే ఉంది... డబ్బు బాగా మేపి ఉంటాడు. ఆ మేతకి సంతృప్తి పడి తన గూహలోకి రానిచ్చాడీ ప్రభాకర్.

"ఇక ఉంటానండీ ప్రభాకర్‌గారూ!"

"అయ్యో అదేంటి మేష్టారూ! నేను మీ ప్రభూనే!" విశాలంగా నవ్వుతూ అన్నాడు ప్రభాకర్.

ఆ నవ్వు చూస్తూంటే మా చుట్టా లబ్బాయి గుర్తు కొచ్చాడు నాకు. వాడు సరదాగా నవ్వుతూ అనేవాడు బంధువులతో. "మీ రాకకి నా హృదయ ద్వారా లెప్పుడూ తెరిచే ఉంటాయి... ద్వార బంధాలు బంధించి ఉన్నా పట్టించుకోకండి." అని.

అలా ఉన్నాయి ప్రభు మాటలు, మాయలు, గారడీలు!

బరువెక్కిన మనసుతో తిరిగొచ్చాను.

** ** **

రోజులు చకచకా గడచిపోతున్నాయి. నేనో ఇంటి వాడిని అయ్యాను. రెండేళ్ళ బాబు.

ఆ రోజున అలవాటుగా దినపత్రిక తిరగేస్తున్నాను. రెండో పేజీలో ఫోటోని చూసి షాక్ తిన్నాను.

"శౌర్యప్రతాపాలు ప్రదర్శించిన సురేంద్రకి మంత్రివర్యులు ప్రభాకర్‌గారి బహుమతి ప్రదానం."

ఫోటో కింద మేటర్ చదువుతూంటే నా గుండె గొంతులో కొచ్చేసినట్లనిపించింది. కన్నీళ్ళ మధ్య అక్షరాలు అలుక్కుపోతున్నాయి.

"ఫలానా అడవుల చుట్టు పక్కల గ్రామాల్లో ఎందరో భూస్వాముల హత్యలకి కారణమైన విప్లవ కారిణి మాళవిక ఎలియాస్ జ్యోతిని ఎన్‌కౌంటర్లో చంపినందుకు....."

"ఎన్‌కౌంటర్.... మాళవిక! మాళవిక... ఎన్‌కౌంటర్! ఆ రెండు పదాల మధ్య నా మనసు విలవిల లాడిపోయింది. ఆ బాధ కన్నీళ్ళ రూపంలో చెంపల్ని తడుపుతోంది.

"మాళవిక ఈ లోకంలో లేదు. చేదు నిజం కంటే నన్ను ప్రభాకర్ ఎక్కువగా బాధపెడుతున్నాడు. మాళవికని నిచ్చెనలా వాడుకుని తన్ని పారేశాడు. సరే.... జ్వాలనెవరూ కొంపల్లో కప్పెట్టిలేరు. సరే... సరే!

కాని... ప్రభాకర్ నిజంగా మనిషైతే కనీసం ఆ బహుమతి నందివ్వడానికి నిరాకరిస్తే నాకు తృప్తిగా ఉండేది. భారంగా తల వెనక్కి వాల్చుకుని పడుకున్నాను.

దూర తీరాల్నించి మాళవిక నవ్వులు, మాటలు వినపడుతున్నట్లుగా మనసులో ఏదో రొద! *

